# నిశ్శబ్ద సంగీతం

ఊరంతటికీ తెల్లవారి నట్టే పచ్చమేడకీ తెల్లవారింది. విడీ వడని చీకట్లతో, పక్షుల కిలకిలా రావాలతో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. పచ్చమేడ ముంగిట రంగి కల్లాపి జల్లుతోంది. దానికి మతి తిన్నగా ఉండదు. అలా అని కొట్టడం, కొరకటంలాంటి వేవీ చెయ్యదు. ఎటొచ్చీ దాన్లో అదే వాగ్కోడం, ఆ చుట్టుపక్కల ఎవరూ లేకపోయినా, ఎదురుగా ఎవరో ఉన్నట్టే నవ్వడం లాంటి వెర్రి మొర్రి పనులేవో చేస్తుంటుంది.

దాని అమ్మమ్మ కాలంనాటినించీ వాళ్ళింట్లో వాళ్ళే ఆ పచ్చమేడలో పాచిపన్లు చేసుకొస్తున్నారు. రంగి అమ్మమ్మకి ఓపిక ఉడిగిపోయాక, దాని తల్లి పైడమ్మ రావడం మొదలు పెట్టింది ఆ ఇంటికి. అదివరకది మూడిళ్ళల్లో చేసుకునేది. పచ్చమేడలో కొచ్చాక, మిగిలిన ఇళ్ళల్లో పని మానుకుంది. కారణం.... ఆ మేడలో పొద్దున్నించీ సాయంత్రందాకా వాళ్ళేపని చెప్తే అదే చేస్తూ ఉండిపోవాలి. ఏకంగా రాత్రికే ఇంటికి వెళ్ళడం. పైగా తను మూడిళ్ళల్లో చేసుకుని తెచ్చుకునే సొమ్ము, పచ్చమేడ వాళ్ళిస్తానన్న జీతమూ సమానం కావడంతో ఒక్క ఆ మేడలోనే పని చేసుకుంటోంది పైడమ్మ. ఈ మధ్య దానికి ఒంట్లో బాగుండక కూతుర్ని పంపుతోంది పన్లోకి. ఓపికున్న రోజు తనే లేచి వొస్తుంది కూతుర్నింటి దగ్గరుంచి.

పచ్చమేడ ముందరి డాబా గేటు పక్కని వేపచెట్టుకింద నల్లకుక్క భొయ్యిమంది. ఉలిక్కిపడింది రంగి.

నీళ్ళు చల్లడం పూర్తిచేసి ముగ్గు వేస్తున్న దాని చెయ్యి వొణికింది.

చేతిలో ఉన్న ముగ్గుకాస్తా నేలపాలైంది. వెనక్కి తిరిగి కుక్క వంక చూస్తూ శాపనార్థాలు మొదలు పెట్టింది రంగి "నీ దుంప తెగా! నీకేం పొయ్యేకాలమే! నా ముగ్గు చూసి అట్టా అరుస్తావ్! ఏం? నా కంటే నువ్వు బాగా వేస్తావా ముగ్గు? ఉండు ఆ గడ్డం ముష్టోడితో చెప్పి నీ పని పట్టిస్తాను. అడు రోజూ ఈ వేపచెట్టుకింద కూచునేగా అన్నం బొక్కేది. ఆడన్నం తింటుంటే పిల్లిలా నువ్వు పక్కన చేరతావ్! నే నెరగననుకున్నావా? ఇయ్యాలాడు రానీ! 'నా చేతిలో ముగ్గొంపింది, దీని కన్నం ఎయ్యమాకు' అని చెప్తాను."

ముందుకి తిరిగి మళ్ళీ వొలికిన ముగ్గువంక చూసి, ఆ ముగ్గేవైనా ఎత్తడానికి వొస్తుందేమోనని చూస్తోంది రంగి.

"రంగీ! రంగీ, ఇంకా అవలేదుటే! నీ పాచ్చెయ్యడం బంగా రంగానూ! ఎంతసేపే?" వీధి వాకిట్లోకి వచ్చింది సుభద్రమ్మ.

"ఇదిగోండమ్మగారూ! అయిపోయినాది. పాడు కుక్క నా సేతిలో ముగ్గొంపేసినాది."

"కుక్క నీ చేతిలో ముగ్గొలపొయ్యడ మేంటే? నీ మతి మండా! త్వరగా కానీ. పెరట్లోకూడా పాచ్చేసి అంట్లు తీసుకో." ఎలా వొచ్చిందో అలాగే లోపలికి వెళ్ళిపోయింది సుభద్రమ్మ.

దొడ్డివైపు నడిచింది రంగి.

చన్నీటిస్నానం ముగించి పట్టుపంచె కట్టి పూజగదిలోకి నడిచారు పరబ్రహ్మంగారు

తను పూజగదిలోకి వెళ్ళేసరికి రోజూ దేవుడి కెదురుగా పూలు నిండివుండే వెండిసజ్జ ఖాళీగా వుండడం చూసి కూతుర్ని కేకేశారు.

"పిలిచావా నాన్నా?" స్టౌమీద కాఫీనీళ్ళు పడేసి తండ్రి కెదురుగా వొచ్చి నిల్చుంది సుభద్రమ్మ.

"పూలేవమ్మా?"

"ఒక్క క్షణం....ఇప్పుడే తెస్తాను. ఇవాళ కాస్త ఆలశ్యంగా మెలుకువ వచ్చింది నాన్నా. దాంతో ఏ పని చేస్తున్నానో, ఏ పని చెయ్యాలో కూడా తెలియనట్టు మతి మతిలో లేకుండా పోతోంది" నొచ్చుకుంది సుభద్రమ్మ

"పరవాలేదు లేమ్మా. ఇందులో కొంప మునిగిపోయే దేమీ లేదు."

వెండిసజ్జ తీసుకుని పెరట్లోవున్న నాలుగురకాల పూలూ కోసి నింపు కొచ్చిందావిడ.

రంగి అంట్లు ముందేసుకుని బర బరా తోముతోంది. అప్పుడప్పుడు నెత్తిమీద మెత్తగా మొట్టినట్టు రాలుతున్న బొగడపూలని తల విసురుగా కదిపి కింద పడేస్తుంది.

తన గదిలో పట్టెమంచంమీద, మెత్తటి వరుపుమీద మెల్లిగా కదిలింది వేదవతి.

కళ్ళు తెరిచి కిటికీలోంచి బయటికి చూసింది. ఇంతెత్తున పెరిగిన ఎర్రగులాబీ చెట్టుకొమ్మ కొసని ఉన్న మొగ్గ వేదవతిని చూసి చిన్నగా ఊగుతూ పలకరించింది. మంచం మధ్యలో ఒక నిమిషంసేపు ఆ మొగ్గని చూస్తూ కూర్చుంది వేదవతి. ఆ తర్వాత సన్నగా తనలో తనే ఏదో సినిమాపాట పాడుకుంటూ మంచందిగి పెరట్లోకి నడిచింది. తెల తెల వారుతుండగా పెరటి గుమ్మంమీద కూచుని ఇంటివెనక వున్న ఏనుగు కొండమీద పరిగెత్తే మబ్బుల్ని చూడటం వేదవతికి సరదా. ఆ కొండ ఏనుగు ఆకారంలో ఉండటంవల్ల అంతా దాన్ని ఏనుగుకొండ అనే అంటారు.

ఆ రోజు యథాప్రకారం ఆ కొండని, కొండమీద కదిలీ కదలనట్లు కనుపించే మబ్బు కన్నెల్ని, ఆ ఆకాశంలో హాయిగా గుంపులు గుంపులుగా ఎగురుతున్న పక్షుల్ని, ఎవరో దేవతలు పైనించి పూల వర్షం కురిపించినట్టు పరుచుకున్న బొగడ పూలనీ చూసి ఆనందిస్తోంది వేదవతి.

రంగి పడేసే కంచాల్లోని మెతుకులకోసం గొంతు చించుకుని కావు కావు మంటూ రణగొణధ్వని చేస్తున్నాయి రెండు కాకులు ఇంక లేచి మొహం కడుక్కుందా మను కుంటుండగా ఫక్కున నవ్వు వినిపించి రంగివైపు చూసింది వేదవతి.

"ఏమిటి రంగీ! ఎందుకు నవ్వుతున్నావ్?" రంగితో కబుర్లు సరదా వేదవతికి. సాధారణంగా రంగి నవ్వడం తను చూడటం తటస్థిస్తే తప్పకుండా "ఎందుకే రంగీ నవ్వుతున్నావని" అడుగుతుంది వేదవతి.

దానికి సమాధానం సాధారణంగా "మా యమ్మ నిన్న నన్ను తిండిపోతా అని తిట్టిందండీ అనో, మా యమ్మ మొన్న నూతికాడ కాలు జారి మూతి ముక్కలయేట్టు పడ్డదండీ అనో, మొన్న సినిమాలో రేలంగి మా బాగా ఏసినాడండీ అనో చెప్పి ముసిముసి నవ్వులు నవ్వుతుంది.

ఇవాళ వేదవతి అడగడమే తడవు, కుడిచేతి మణికట్టుతో నుదుటి మీది జుట్టు వెనక్కి తోసుకుంటూ తలెగరేసింది రంగి "పాడుకుక్కండీ, నా చేతిలో ముగ్గు వొంపేసినాదండీ!"

వేదవతి ఏదో అనేలోపలే వంటింట్లోంచి సుభద్రమ్మ అరిచింది.

"నీ పిచ్చి దొంగల్తోలా! ఇంకా కుక్కసంగతే పట్టుకు వేలాడుతున్నావుటే. నాతో చెప్పావు. వరసగా ఇంట్లో అందరితోటీ ప్రతి చిన్న విషయం చెప్పాలిటే అదేదో కొంప మునిగిపోయే వ్యవహారం లాగానూ, కొత్త సినిమా కథలాగానూ. అయినా కాస్త ముగ్గొలికితే మూడు ఊళ్ళు మునిగినట్టు దాన్ని గురించే ఆలోచిస్తున్నావుటే! అందుకే అలా అంత

సేపు తోముతావు గిన్నెలు. మీ అమ్మయితే ఈపాటికి గిన్నెలు తోమక్కడ పెట్టి, తొట్టిలో నీళ్ళుతోడి, ఇల్లుకూడా ఊడ్చేది."

తలొంచుకుని, ముఖం మాడ్చుకుని, గబగబా గిన్నెలు తోమడం మొదలుపెట్టింది రంగి.

రంగి ఎవరికీ భయపడదు ఒక్క సుభద్రమ్మకి తప్ప. పైడమ్మే చెప్పింది "పిచ్చి పిచ్చి ఆలోచనల్తో పని దబ్బుని సెయ్యేదండి. మీరు కా స్త మద్దెమద్దెలో మందలించడం, గదమాయించడం సేస్తుందండి. అప్పుడది తొరగా సేస్తది పని" అంటూ.

అందుకే రంగిమీద కోపం ఏమీ లేకపోయినా, పని తొందరగా చేయించడానికి అప్పుడప్పుడు గదమాయిస్తుంటుంది సుభద్రమ్మ.

ఈ సంగతి తెలియని వేదవతి పొద్దున్నే పెళ్ళైనా తోముకోకుండా పాచి మొహంతో తల్లిమీద ఇంతెత్తున కోపం తెచ్చుకుంది. రంగి సంగతి తెల్సుకదా ! అది వెర్రిది. దానిమీద కోపం తెచ్చుకోడం ఎందుకు ?—

జంటగా ఆకాశంలో ఎగురుతున్న రెండు పిట్టల్ని చూసి వేదవతికి చటుక్కున భాస్కర్రావు గుర్తొచ్చి చెంపల్లో కెంపులు మెరిశాయి.

"రేపు సాయంత్రం మనోరమలో కాఫీ తాగుదాం" నిన్న సాయంత్రం నవరంగ్‌లో సినిమా చూసి విడిపోయేటప్పుడు భాస్కర్రావు అన్న మాటలు ఇప్పుడు మళ్ళీ వేదవతి చెవుల్లో ఏదో రహస్యం చెప్తున్నట్టు, గిలిగింతలు పెడుతున్నట్టు వినిపించాయి.

ఉషారుగా లేచి 'అబ్బ ! సాయంత్రందాకా ఎలా గడపడం ? ఇప్పుడే సాయంత్రం అయిపోకూడదూ !" అనుకుంటూ దంతధావనాని కుపక్రమించింది వేదవతి.

"ఏమే ! నిద్రలేచి ఏ జామైంది ? ఇంకా మొహం కడుక్కోలా?" సుభద్రమ్మ కేకకి మూతి తిప్పింది వేదవతి.

"అబ్బబ్బ! ఏవిటే నిద్రలేచింది మొదలు అందరూ నీలాగే యంత్రంలా తిరగాలంటావు. ఏం? ఒక్క నిమిషం అలా కూర్చుని ఆ తర్వాత మొహం కడుక్కుంటే ముల్లోకాలూ భస్మం అవుతాయా?"

తోమిన గిన్నెలు వంటింటి గుమ్మంలో బోర్లిస్తున్న రంగి కిసుక్కున నవ్వింది.

"అబ్బబ్బ! ఇదొత్తి మధ్యలో మాటాడితే చాలు కిసుక్కు కిసుక్కు మంటూ" సుభద్రమ్మ చిరుకోపంతో అంది.

"అసలు నీకెలా వస్తుందే అలా నవ్వు రంగీ? మాటి మాటికీ అలా నవ్వుతుంటే నీ బుగ్గలు నెప్పిపుట్టవుటే?" విచిత్రంగా రంగి ముఖంలోకి చూసింది వేదవతి.

చిన్నగా కూతుర్ని మందలించింది సుభద్రమ్మ, "దాన్ని నువ్వు ఏమైనా అడిగావంటే ఇక్కడే చతికిలపడి రోజంతా చెప్తుంది పురాణం నీకు, వినే ఓపికా, తీరుబడీ నీ కుండాలేగానీ."

కొంగు నోటి కడ్డం పెట్టుకుని పెరట్లోకి వెళ్ళిపోయింది రంగి. దాన్నెత్తిమీద ఒక్కటి మొట్టాలనిపించింది వేదవతికి. లేకపోతే అంత ఇదిగా కొంగు అడ్డం పెట్టుకుని నవ్వాపుకోవల్సిన భాగోతం ఇక్కడేం జరిగిందని? అర్థంలేని నవ్వు అలా ఎలా వొస్తుందో దానికి?

కాఫీ తాగుతుంటే వేదవతి ఆలోచనలు మళ్ళీ భాస్కర్రావు మీదకి మళ్ళాయి.

"ఎవ్వరూ అడ్డు చెప్పలేరు వేదా! నేను నిన్ను పెళ్ళి చేసుకోడం ఖాయం. ఒక విధంగా చూస్తే, మన మనసులు ఏనాడో ఏకమయ్యాయి కాబట్టి మన పెళ్ళి ఎప్పుడో అయిపోయినట్టే లెక్క." భాస్కర్రావు మాటలు పదే పదే వినిపించి గిలిగింతలు పెడుతున్నాయి వేదవతిని.

అమ్మా, తాతయ్యల కనుగప్పి తను భాస్కర్రావుతో తిరగడం ప్రేమ, పెళ్ళిదాకా రావడం ఇవన్నీ తల్చుకుంటుంటే తనకే ఆశ్చర్య మనిపించి ఒక్క క్షణం చిన్నగా నవ్వుకుంది వేదవతి.

* * *

మధ్యాహ్నం వేదవతి తన గదిలో పడుకుంది.

ఎదురింటి దాబా తలుపులు వేసున్నాయి.

వేపచెట్టుమీద కాకి ఏమీ తోచకో, దాహం వేసో తెగ అరు స్తోంది.

వేపచెట్టు కొమ్మలు గాలికి చిన్నగా శబ్దం చేస్తున్నాయి. గడ్డం ముష్టాడు వేపచెట్టు కింద కూచుని అన్నం మూట విప్పాడు. నల్లకుక్క తోక ఊపుకుంటూ వచ్చి వాడి ముందు కూచుంది. ముందు దానికింత పడేసి తను తినడం మొదలు పెట్టాడు వాడు.

వాడు తినే అన్నంచూసి వేపచెట్టుమీద కాకి రివ్వున వచ్చి వాడి పక్కన వాలింది.

భొయ్యిమంటూ దాన్ని తరిమి, తిరిగి అది చెట్టెక్కేదాకా ఊరు కోలేదు నల్లకుక్క.

"ఏందే! కాకులు రాకుండా నాకు కాపలా కాస్తున్నావంటే!" ప్రేమగా దాని వీపు నిమిరాడు. పెరట్లోంచి అప్పుడే వీధివైపొచ్చిన రంగి ముష్టాడినీ, కుక్కనీ సూసి పరుగులాంటి నడకతో వేపచెట్టుకిందికి చేరుకుంది.

"ఏవయ్యోయ్! ఈ కుక్కకి అన్నం ఎయ్యమాకు." ఎడం చెయ్యి నడుమ్మీద పెట్టుకుని, కుడిచేత్తో కుక్కని చూపిస్తూ మొహం కోపంగా పెట్టి మాట్లాడుతున్న రంగిని ఒక్క క్షణం విచిత్రంగా చూశాడు వాడు.

ఆ తర్వాత తల వంచుకొని చిన్నగా నవ్వాడు.

"ఈ కుక్క ఏం పాపం సేసిందనలా గంటున్నావ్ ?"

"అయ్యో! పాపం సూడ్డానికి కుక్కలా ఉంది కదా అని ఏ పాపం ఎరగదంటున్నావ్! నా సేతిలో ముగ్గొంపెయ్యలా ? దెబ్బలాడు తున్నట్టుగా గొంతు పెద్దది చేసింది రంగి. ఆశ్చర్యపోయాడు వాడు.

"అదెట్టా ? నీమీద పడ్డదా వొచ్చి ?'' అడ్డంగా తల ఊపింది రంగి. వాడి కర్థం కాలేదు ''మరి నీ సేతిలో ముగ్గెలా ఒంపింది ?" "నేనటు తిరిగి ముగ్గెడతా ఉంటే అది సెట్టు కిందసేరి భొయ్యిమన్నాది. అప్పుడు నేను ఉలిక్కిపడలా మరి ? పుడితే నా సెయ్యోణికి సేతిలో ముగ్గొలికి పోనాది." కోపంగా కుక్క వంక చూసింది రంగి.

ఫక్కుమన్నాడు వాడు. ప్రేమగా కుక్కని ఒళ్ళోకి లాక్కున్నాడు.

"కుక్కకున్న యిస్వాసం మనిసికి లేదు తెల్సా....ఉంటే యియ్యాల నేనిలా ఉండేటోడిని కాదు." ముష్టివాడి కళ్ళల్లో నీళ్ళు కదిలాయి.

"నేను నమ్మిన నా స్నేయితుడే నన్ను మోసం సేసి యాపారం అంతా తన సొంతం సేసుకుని నాకొక్క పైసా ఇవ్వకపోవడమే కాక ఏదో కేసు బనాయించి నన్ను జైల్లోకి తోయించాడు. జైలు నించొచ్చి నంక ఇదిగో ఇట్టా ఉన్నాం నేనూ నా జీవితం. ఉన్న ఊళ్ళో తలెత్తుకో లేక ఇట్లా పరాయి ఊళ్ళమ్మట పడ్డాను." చెప్పడం ఆపి పచ్చమేడ వంక తదేకంగా చూశాడు వాడు. వాడి చూపుల్లో "నా జీవితమే కనుక ఇలా తగలడకుండా ఉంటే, నా స్నేయితుడే కనక మోసం చెయ్యకుండా ఉంటే నేనీ పాటికి ఈ పచ్చమేడలాంటి ఏ మేడలోనో రాజభోగా లనుభవించక పోయే వాడినా అన్న అర్థం స్పష్టంగా మెదిలింది.

వాడు మాట్లాడింది సగం అర్థం అయీ, సగం అవకా తెల్లబోయి చూసింది రంగి.

... ఓ నిమిషం పోయాక తనలో తనే సన్నగా ఏదో గొణుక్కుంటూ అక్కడినించి వచ్చేసింది.

"అమ్మాయ్! సుభద్రా!"

"ఏమిటి నాన్నా? వంటింట్లో భాగవతం చదువుతున్న సుభద్రమ్మ, పుస్తకం మడిచి చాపమీద పెట్టి లేచివతలికి రాబోయింది.

తనే గబుక్కున వంటింట్లోకొచ్చి, గొంతు తగ్గించి మెల్లగా అన్నారు పరబ్రహ్మంగారు "వేద నిద్ర పోతోందా?"

"ఆ....పడుకున్నట్టుంది. లేపనా?"

"అబ్బే! అవసరం లేదు నీతో నే వో మాట చెప్దామని." సందేహంగా ఆగిపోయారాయన.

"ఏమిటి నాన్నా?"

"అమ్మాయి ప్రవర్తన నాకీ మధ్య కాస్త అనుమానంగా ఉంది.

"ఎవరూ! వేద గురించా నువ్వంటున్నది?"

"ఆ. దాన్ని గురించే. రామభద్రంగారు మొన్న నాతో అన్నారు. ఎవరో కుర్రాడితో సినిమా హాల్లోనూ, హోటల్లోనూ కనిపించిందట ఆయనకి. సంగతేదో తెలుసుకుని జాగ్రత్త పడటం మంచిదని హెచ్చరించారాయన. నేను నమ్మలేక పోయాను. నిన్న మళ్ళీ ఇంకెవరో ఇదే మాట అనడంతో నమ్మక తప్పట్లేదు నాకు. అమ్మాయితో ఈ సంగతి ఎలా అనడమా, బాధ పడుతుందేమోనని ఆలోచిస్తున్నాను.

సుభద్రమ్మ కళ్ళల్లో కోపం చిందులు తొక్కింది.

"బాధ పడటమా ? ఏం! అది చేసిన పనికి మనం బాధపడమూ ? అయినా ఇదెక్కడి ప్రారబ్ధం ?"....

"ఉష్....నెమ్మది. అమ్మాయి వింటే బాధ పడుతుంది నెమ్మదిగా ఆలోచించి ఏదో ఒకటి చేద్దాం." సర్ది చెప్పబోయారు పరబ్రహ్మంగారు.

కొంగుతో కళ్ళు ఒత్తుకుంది సుభద్రమ్మ.

"పెద్దమ్మాయి వైదేహి ఇలానే చేసిందా! చక్కగా చదివించి నంత వరకూ చదువుకుంది. చూసిన సంబంధం చేసుకుంది. సుఖంగా కాపురం చేసుకుంటోంది. దీనికీ పాడు బుద్ధులెలా వచ్చాయో! వాడెవడో మన కులం వాడయ్యుండడు. అయితే ధైర్యంగా చెప్పేది కాదూ! కులం కాని వాడిని కట్టుకుని మన పరువు గంగలో కలుపుతుంది కాబోలు. అలా చచ్చినా కుదరదని గట్టిగా చెప్పెయ్యి నాన్నా. ఒకవేళ అది మనం చెప్పి నట్టు వినకుండా వాడినే కట్టుకుంటే ఆస్తంతా వైదేహిపేర రాసెయ్యి. నీ తదనంతరం ఆస్తి వైదేహికే చెందుతుంది దీనికొక్క పైసా ఇవ్వద్దు.

కంగారు పడ్డారు పరబ్రహ్మంగారు.

"అదేదో చిన్న తనం, తెలియక తొందరపాటుతో ఎవరితోనో స్నేహం చేసుండచ్చు. అంతమాత్రాన పెళ్ళిదాకా వీళ్ళ ప్రణయం పోతుం దని అనవసరంగా మనం కంగారు పడటం ఎందుకు? నువ్వు మాత్రం దాన్నేమీ అనకు. నేను రేపు దాంతో అన్నీ మాట్లాడతాను. ఈ ప్రేమలూ అవీ పనికి రావని చెప్తాను."

ఆ క్షణంలో భర్త గుర్తుకొచ్చాడు సుభద్రమ్మకి.

వేదవతికి బారసాల కూడా కాకముందే భర్త పరలోకం చేరు కోవడం, తండ్రి తననీ పిల్లల్నీ ఇక్కడికి తీసుకొచ్చేయడం, తనకి నచ్చిన పేరు 'వేదవతి' అని రెండో పిల్లకి ఆయనే నామ కరణం చెయ్యడం అన్నీ ఒక్కటొక్కటి గుర్తుకొచ్చాయి.

పరబ్రహ్మంగారికి కూతురూ, మనవరాళ్ళూ తప్ప కావల్సిన వాళ్లెవరూ లేరు. భార్యపోయి చాలా కాలమైంది. కొడుకు లసల్లేరు. ఆస్తి అంతా ఆయన స్వార్జితమే. ఆస్తికి వారసులు కూతురూ, మనవరాళ్ళూ తప్ప వేరెవరూలేరు.

వంటింటి గుమ్మం ముందునించి వేదవతి వెళ్ళడం చూసి ఉలిక్కిపడ్డారు పరబ్రహ్మంగారు.

ఎంతసేపైందో ఆ పిల్ల లేచి ? తన మాటలన్నీ విందేమో ? ఈ అనుమానం ఆయన మనసుని పీకింది.

సాయంత్రం పరబ్రహ్మంగారు బయటకెళ్ళాక, తల్లి వంటింట్లో పని చేసుకుంటుండగా, బట్టలు మార్చుకుని, పర్సు తీసుకుని వీధి వాకిట్లో కొచ్చి, రంగిని పిల్చింది వేదవతి.

"అమ్మగారు అడిగితే నేనలా కమలా వాళ్ళింటికి వెళ్ళానని చెప్పు" అంటూనే గబగబా రోడ్డుమీది కొచ్చి, కనపడ్డ రిక్షా ఆపి ఎక్కికూర్చుని "మనోరమకి పోనీ" అంది, తల్లి బయటి కొచ్చి ఎక్కడ పిలుస్తుందోనని భయపడుతూ.

* * *

దోసె తింటూ ఒక్క నిమిషం మాట్లాడలేదు భాస్కర్రావు. దోసె వంక చూడనైనా చూడకుండా అంది వేదవతి "ఏమిటి ఆలోచిస్తున్నావ్?"

"మీ అమ్మనీ, తాతయ్యనీ ఒప్పించకపోతే ఆస్తిలో వాటా నీకు రాదు. ఔనా ?"

గంభీరంగా ఉన్న భాస్కర్రావు ముఖం రెప్పవాల్చకుండా చూసింది వేదవతి.

ఆ తర్వాత తలవంచుకుని మెల్లిగా అంది. "పోనిద్దూ ! వెధవాస్తి. నీ ఉద్యోగంతో మనిద్దరి పొట్టలూ గడవక పోతాయా ?

"ఒక్క పొట్ట గడవడానికి కైతే ఎందుకు చాలదూ ? కానీ జీవిత మంటే ఒక్క పొట్ట గడవడమే కాదుగా. సరదాలూ, షికార్లూ, జల్సాలూ, మజాలూ, పిల్లలూ ఇవన్నీ కలుపు కుంటేనే జీవితమవు తుంది."

"అయితే ?" అసలు సంగతేమిటో అంతుపట్టలేదు వేదవతికి.

"నువ్వుత్త అమాయకురాలివి. నీకేమీ తెలియదు, ఎలాగైనా సరే ఆస్తిలో వాటా నీకూ రావల్సిందే !" భాస్కర్రావు కంఠం స్థిరంగా పలికింది.

ఇద్దరూ తినడం పూర్తిచేసి, వాష్‌బేసిన్లో చేతులు కడుక్కు న్నారు.

కాఫీ కూడా తాగడం పూర్తయ్యాక హడావుడిగా లేచాడు భాస్కర్రావు.

"నువ్విక్కడే ఉండు. ఒక్క అయిదు నిమిషాలు. నే నిప్పుడే వస్తాను."

గబగబా పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వెళ్తున్న భాస్కర్రావుని వింతగానూ, ఆశ్చర్యంగానూ చూసింది వేదవతి.

మళ్ళీ పావుగంటగ్గానీ రాలేదు భాస్కర్రావు వస్తూనే జేబులోంచి వో పొట్లం తీసి వేదవతి కందించాడు. పక్కనే కూర్చుని, అతిమెల్లిగా అన్నాడు "మీ తాతయ్యకి గుండె జబ్బులేం లేవన్నావు కదూ !"

"లేవు" నవ్వింది వేదవతి.

"ఆయన రోజూ రాత్రి పడుకునేటప్పుడు పది గంటలకి పాలుతాగి పడుకుంటారని ఇదివరకెప్పుడో చెప్పావు."

"ఔను. రోజూ తాగుతురు. మా అమ్మ రోజూ తొమ్మిదింటి కల్లా నిద్రపోతుంది. తాతయ్యకి పదింటికి పాలు నేనే తీసికెళ్ళి ఇస్తాను."

బేరర్ బిల్లు తీసుకొచ్చి, వినయంగా ముందు పెట్టాడు.

డబ్బు తీసుకుని బేరర్ అక్కడినించి వెళ్ళిపోయాక మళ్ళీ మెల్లిగా రహస్యంగా అన్నాడు భాస్కర్రావు. "మనం పెళ్ళి చేసుకుంటే ఆ కోపంతో వెంటనే ఆస్తి అంతా మీ అక్కకీ, అమ్మకీ చెందేటట్టు విల్లు రాసేస్తారు మీ తాతయ్య. అలా కాకుండా, ఆయన పోయాక మనం పెళ్ళి చేసుకుంటే, అంటే ఆయన విల్లు రాయకుండానే పోయేటట్టు చేస్తే అప్పుడు మీ అమ్మా, అక్కయ్యలతో పాటూ ఆస్తిలో వాటా నీకూ వస్తుంది. అలా జరగాలంటే రాత్రి నువ్వు ఆయనకి ఇచ్చే గ్లాసు పాలల్లో ఈ మందు కలపాలి."

ఆత్రుతగా అంది వేదవతి "ఏం మందది ?"

వేదవతి చెవిలో గొణిగాడు భాస్కర్రావు "విషం."

బెదురు చూపులు చూసింది వేదవతి.

మరుక్షణం ఏదో గుర్తొచ్చినట్టు చుట్టూ పరికించింది. తాము కూర్చున్న ఫ్యామిలీ రూమ్‌లో, మెల్లిగా మాట్లాడుకునే తమ మాటలు వినిపించని దూరంలో ఇంకో జంట ఉంది.

"ఇవాళ రాత్రికే" మెల్లిగా వేదవతి చెయ్యిమీద తట్టాడు భాస్కర్రావు.

"నువ్వేం మైనారిటీ తీరని పిల్లవి కావు. జీవితమంటే ఏమిటో నీ కిందాక చెప్పాను. నేను చేసే గుమస్తా ఉద్యోగంతో మనం, మనకి పుట్టే పిల్లలూ అవస్థలు పడుతూ బ్రతికే బదులు, నీ కొచ్చే వాటాతో చక్కగా బిజినెస్ స్టార్ట్ చేశామంటే రాజాలా జీవితాలు గడపచ్చు. ఆలోచించుకో. నేను చెప్పినట్టు చేస్తేనే మన పెళ్ళి జరిగేది." చివాలున లేచాడు భాస్కర్రావు.

వేదవతి తల తిరిగిపోతోంది.

* * *

అన్నం సయించలేదు వేదవతికా రాత్రి.

రెండు మెతుకులు కతికి, తన గదిలో కెళ్ళి మంచమ్మీద వాలి పోయింది.

తాతయ్యకి గ్లాసుతో పాలు తీసి కెళ్ళ వల్సిన సమయం దగ్గరవుతున్న కొద్దీ గుండెల్లో దడ ప్రారంభమైంది పదవగానే భాస్కర్రావు ఇచ్చిన పొట్లం తీసుకుని వంటింట్లోకి నడిచింది. భాస్కర్రావులో ఉన్న అందం, ఆకర్షణా ఒక పక్క లాగుతుంటే, తను చేస్తున్నది పాపమన్న భయం మరో పక్క పీకుతోంది వేదవతిని.

గ్లాసునిండా పాలు పోసి, పొట్లంలో ఉన్న పొడి అందులో బాగా కలిసేలా కలిపింది.

భాస్కర్రావు లేకుండా తను బ్రతకలేదు.

అతను తనక్కావాలి. మనస్ఫూర్తిగా అతన్ని ప్రేమించింది తను. అతను చెప్పినట్టు తను చెయ్యకపోతే తనకతను దూరమౌతాడు. అది తన హృదయం భరించలేదు. కానీ .... కానీ .... ప్రాణ సమంగా తనని పెంచిన తాతయ్యకే ముప్పు తీసుకురావడం .... భగవంతుడా! ఎందుకిలాంటి సమస్య తెచ్చిపెట్టావు? ఏం చెయ్యాలి?....

వీధి తలుపు ఎవరో తట్టినట్టయి ముందుగదిలోకి వొచ్చి కిటికీ లోంచి బయటికి చూసింది వేదవతి.

ఎవ్వరూ లేరు. గాలికి కిటికీ రెక్క కొట్టుకున్న చప్పుడది. ముంచుకొచ్చిన జ్వరంతో ముడుచుకు పడుకునున్నాడు వేపచెట్టుకింద గడ్డం ముష్టాడు. వాడి పక్కనే కూర్చునున్న నల్లకుక్క అస్పష్టంగా కనిపించింది వేదవతికి.

తిరిగి వంటింట్లో కొచ్చి పాలగ్లాసు తీసుకుని తాతయ్య గదిలో కొచ్చింది.

"పాలు.... తాతయ్యా!" మనవరాలి పిలుపుతో మంచమ్మీద లేచి కూర్చున్నారు పరబ్రహ్మంగారు.

గానందుకుని పక్కనే బల్లమీద పెడుతూ నవ్వారు "ఏమ్మా! సరిగ్గా భోజనం చెయ్యలేదుట ఈ పూట. ఒంట్లో ఎలా ఉందమ్మా." లేచి మనవరాలికి దగ్గరగా వచ్చారాయన.

వేదవతి కాళ్ళు ఒణకడం మొదలు పెట్టాయి.

కిటికీలోంచి చల్లగాలి వీస్తున్నా కూడా నుదుటి మీదా, మెడమీదా చెమటలు పడుతున్నాయి.

"ఏమ్మా! అమ్మమీద అలిగావా? నువ్వేదన్నా అడిగితే కాదన్నదా? చెప్పమ్మా! నీ తాతయ్య ఉండగా నీకే లోటూ రాదమ్మా!" తాతయ్య చూపించే ఆప్యాయతకి వేదవతి మనసు విలవిల్లాడింది.

కళ్ళల్లో తిరిగే నీటితో తాతయ్య గుండెలమీద వాలిపోయింది.

తెల్లబోయారు పరబ్రహ్మంగారు.

బాధతో కుమిలిపోయింది వేదవతి.

ఒక నిమిషం పోయాక మనవరాలి తల నిమురుతూ మెల్లిగా అన్నారాయన "నీ సంగతి నాకు తెలిసిందమ్మా! నువ్వేం చంటిపిల్లవు కావు. నీ మెడలు వంచి నీ కిష్టంలేని పెళ్ళి ఎప్పటికీ చెయ్యను. ప్రేమించిన ఆ కుర్రాడిని తప్ప మరొకళ్ళని పెళ్ళిచేసుకోను అని నువ్వు పట్టుబడితే నేను మాత్రం కాదంటానా తల్లీ! కానీ కుర్రాడి గుణగణాలు తెలుసుకోడం ప్రధానం కాదంటావా తల్లీ."

తాతయ్య మాటలకి సిగ్గుతో చితికిపోయింది వేదవతి.

"నా కళ్ళు తెరిపించావు తాతయ్యా!" సన్నగా తనలో తనే అనుకుంది వేదవతి.

భాస్కర్రావు అందాన్నిచూసి మైమరచిపోయింది తను. అతని అందం, అతని మాటలు తనని ఆకర్షించి బానిసని చేశాయి. అతనికి డబ్బు ప్రధానం కానీ తను కాదని గ్రహించలేక పోయింది తను.

పెళ్ళయ్యాక డబ్బుతో మదమెక్కి తనని ప్రేమగా చూడక పోవచ్చు. నిజంగా డబ్బుకాక తనే అతనికి కావల్సివుంటే తన నొక హంతకురాలిగా చెయ్యడానికి ప్రయత్నిస్తాడా? ఇటువంటి పాపపు పని చేస్తే దాగుతుందా! తెల్లారాక పట్టుబడిపోతే తను? పోలీసులు తన చేతులకి బేడీలు తగిలించరూ! భాస్కర్రావేమాత్రం ఆలోచించలేదా? అతనిలో ఉన్న ఆకర్షణ తన కళ్ళు కప్పేసింది. తనని మోసం చేసింది. ముందు వెనకలాలోచించకుండా చేసింది ఏ మందు జల్లాడో తనమీద! ఏ మైకం ఆవరించిందో! ఇంత ఘాతుకం చెయ్యడానికి వెనుదీయలేదు తను. తనవంటి పాపిష్ఠిదానికి ఏ శిక్షవేసినా చాలదు....తను బ్రతకడం దండగ....మెరుపులా ఓ ఆలోచన మెరిసింది వేదవతి మనసులో.

"తాతయ్యా! నేను సరిగ్గా అన్నంతిన్లేదు కదూ! ఆకలేస్తోంది.... ఈ పాలు నేను తాగుతాను" వేదవతి గొంతు వణికింది.

"పిచ్చితల్లీ! నేనూ అదే చెప్దామనుకుంటున్నాను. అర్ధరాత్రి ఆకలేస్తుందేమో అన్నం సరిగ్గా తిన్లేదు. ఈ పాలు తాగెయ్యమందా మనుకుంటున్నాను. తాగు తల్లీ! మనసులో ఏ దిగులూ పెట్టుకోకు. రేప్పొద్దున్న అన్ని విషయాలూ మాట్లాడుకుందాం!" పాలగ్లాసు తనే స్వయంగా మనవరాలి చేతి కందించారు పరబ్రహ్మంగారు.

నీరసంగా నవ్వింది వేదవతి.

భయం భయంగా చూస్తూ గ్లాసందుకుంది.

"తాతయ్య ప్రాణానికి ముప్పు తీసుకురాబోయిన తనకి ఈ శాస్తి జరగవలసిందే! తనవంటి దీ భూమ్మీద ఉండకూడదు." పాలన్నీ తాగి గ్లాసు బల్లమీదుంచింది వేదవతి.

వేపచెట్టుకింద ముడుచుకుని పడుకున్న ముష్టాడి ప్రాణం గిలగిలా తన్నుకుని గాలిలో కల్సింది.

నిర్మానుష్యంగా, నిశ్శబ్దంగా ఉన్న ఆ వీధిలో నల్లకుక్క అరుపు దీనంగా వినిపిస్తోంది.

★